## • కొప్పులకు లక్ష విరాళం



ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన బాధినేని అశోక్ అభిమానం చాటుకున్నాడు. ఆస్ట్రేలియాలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. తన మొదటి జీతం రూ.లక్షను ఎన్నికల ఖర్చు కోసం బుధవారం గోపులాపూర్ ప్రజా ఆశీర్వాద యాత్రలో జడ్పీటీసీ రాజేందర్ ద్వారా మంత్రి కొప్పులకు ఇచ్చారు. - ధర్మపురి

# కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌కు ఓటమి భయం

**అందుకే దిగజారుడు మాటలు • చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి బాల్కసుమన్**

మంచిర్యాలటౌన్, నవంబర్ 22: ఓటమి భయంతోనే చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ విమర్శించారు. బుధవారం మంచిర్యాలలోని బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలి చీఫ్ విప్ భానుప్రసాద్‌రావుతో కలిసి సుమన్ మాట్లాడారు. తండ్రి లాంటి కేసీఆర్‌పై వివేక్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజలను ఏకతాటిపైకి తీసుకు వచ్చి, 1969లో సాధ్యం కాని తెలంగాణను ఢిల్లీ మెడలు వంచి సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. వివేక్ తండ్రి వెంకటస్వామి మరణించినప్పుడు ఆయన భౌతికకాయాన్ని గాంధీభవన్‌కు కూడా తీసుకురాకుండా కాంగ్రెస్ అవమానించిందని తెలిపారు. కానీ సీఎం కేసీఆర్ వెంకటస్వామి విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించడమే కాకుండా ఆయన జయంతి.. వర్ధంతిలను అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి గొప్ప వ్యక్తిని దూషించడానికి వివేక్‌కు నోరెలా వచ్చిందని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కేసీఆర్‌పై, తనపై అడ్డగోలుగా విమర్శిస్తున్నారని, ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలతో దుష్ప్రచారం చేస్తున్నారని, అయినా సంయమనంతో వ్యవహరిస్తున్నామని తెలిపారు. వివేక్, అతని కుటుంబ సభ్యులు, ఆయన సొంత మీడియాలో అడ్డగోలుగా ఆరోపణలు చేసినా సహిస్తున్నామని, ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న బాల్క సుమన్. చిత్రంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు

**ఐటీ, ఈడీ దాడులు బీజేపీ పనే..**

బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా ఉండి పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన వివేక్‌పై బీజేపీ కక్ష తీర్చుకుంటున్నదని మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. విశాఖ ఇండస్ట్రీస్ కార్యాలయాలపై, వివేక్ ఇండ్లపై ఐటీ, ఈడీ దాడులు బాల్కసుమన్, బీఆర్ఎస్ పనేనని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# శిక్షగా గుంజీలు.. విద్యార్థి మృతి

జైపూర్ (ఒడిశా), నవంబర్ 22: క్లాస్ ఎగ్గొట్టి ఆడుకుంటున్న పదేండ్ల విద్యార్థికి టీచర్ విధించిన శిక్ష అతడి ప్రాణాన్నే తీసింది. ఒడిశాలో గుంజీళ్లు తీసిన నాలుగో తరగతి విద్యార్థి అస్వస్థతతో కన్నుమూశాడు. జైపూర్ జిల్లాలోని ఓరలిలో ప్రభుత్వానికి చెందిన సూర్యనారాయణ నోడల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో రుద్రనారాయణ సేథి నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం అతడు తరగతులు ఎగ్గొట్టి ఆడుకోవడాన్ని గమనించిన ఒక టీచర్ అతడికి గుంజీళ్లు శిక్షగా విధించారు. అయితే గుంజీళ్లు తీస్తూ రుద్రనారాయణ కుప్పకూలడంతో దవాఖానకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు డాక్టర్లు ప్రకటించారు. కాగా, దీనిపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

# అభివృద్ధా? అరాచకమా?

- ప్రజలు ఎటువైపో తేల్చుకోవాలి
- రేవంత్ బెదిరింపులకు భయపడం
- నాడు కాంగ్రెస్ అల్లర్లను విస్తరించింది
- నేడు బీఆర్ఎస్ ఐటీని విస్తరిస్తున్నది
- మీడియాతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, నవంబర్ 22: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ అభివృద్ధికి, కాంగ్రెస్ అరాచకానికి మధ్య జరుగుతున్నవని, ప్రజలు ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. పోలీసుల పేర్లను రెడ్ డైరీలో రాసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆయన బెదిరింపులకు భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని ఆమె స్పష్టం చేశారు. కానీ.. కాంగ్రెస్ పార్టీ పేరును తెలంగాణ ప్రజలు ఇప్పటికే రెడ్ డైరీలో రాసుకున్నారని, ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటుతో సరైన గుణపాఠం చెప్తారని తెలిపారు. బోధన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని కవిత తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. 80 సీట్ల కన్నా ఒక్కటి తక్కువ వచ్చినా ఏదంటే అది చేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఇలాంటి సవాళ్లను 10 సార్లు చేశారని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గత ఎన్నికల్లో అన్నారని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లో అల్లర్లను విస్తరిస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలకు ఐటీ రంగాన్ని విస్తరించిందని తెలిపారు. తమ పార్టీ బోధన్ అభ్యర్థి షకీల్‌పై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని, ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డి కొంత బాధ్యతగా మాట్లాడుతారని అనుకుంటే.. ఆయన ఉల్టా పోలీసులను విమర్శిస్తున్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలపై భౌతిక దాడికి దిగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. మొన్న దుబ్బాక, నిన్న మంథని, బోధన్‌లో కాంగ్రెస్ దాడులు చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, మేయర్ దండు నీతూకిరణ్ పాల్గొన్నారు.

## రెండో రోజూ ఐటీ దాడులు

- ఆదిత్య కాటన్ మిల్లు భాగస్వాముల లావాదేవీలపై ఆరా
- కొనసాగుతున్న సోదాలు

జమ్మికుంట, నవంబర్ 22: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య కాటన్ మిల్లు వ్యాపార భాగస్వాములపై ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) శాఖ అధికారుల దాడులు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఈ సోదాల్లో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకుల్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు నిల్వ, బదిలీలు, విత్‌డ్రాలు, స్థిరాస్తి కొనుగోళ్లు, రుణాలు తదితర అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. భూముల క్రయవిక్రయదారులు, రైతులు, వ్యాపారులను పిలిపించి.. కాటన్ క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డుల పరిశీలన, అకౌంట్ల నిర్వహణపై లోతుగా విచారిస్తున్నట్టు తెలిసింది. జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ కాటన్ వ్యాపార భాగస్వాములు ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ, బచ్చు భాస్కర్ తదితరుల మిల్లులు.. ఇండ్లపై కేంద్ర బలగాల సిబ్బంది బందోబస్తు మధ్య ఐటీ అధికారుల బృందం మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకూ ఏకకాలంలో సోదాలు చేస్తున్నది. తనిఖీల్లో ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ ఇండ్లల్లో లెక్కా పత్రాల్లేని నగదు, బంగారు, వెండి వస్తువులు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు దొరికినట్టు తెలిసింది.

# నన్ను చంపేందుకు తుమ్మల కుట్ర

**విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్ ఆరోపణ**

ఖమ్మం, నవంబర్ 22: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన కుమారుడు తుమ్మల యుగంధర్ తనను చంపే కుట్రలు చేస్తున్నారని విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. ఖమ్మం నగరంలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన ఇంట్లో డబ్బులు ఉన్నట్టు భావించి మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు చావా నారాయణరావు, కమర్తపు మురళి, నరేందర్, మందడపు మనోహర్, నాగుల్ మీరా, సాధు రమేశ్‌రెడ్డితోపాటు సుమారు 200 మంది తనపై దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలానికి వచ్చి కాపాడారని చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై నగర పరిధిలోని ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ కుట్రలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన కుమారుడు తుమ్మల యుగంధరే కారణమని పేర్కొన్నారు. తనకు రక్షణగా ఉన్న గన్‌మెన్‌ను కూడా తుమ్మల తన పలుకుబడిని ఉపయోగించి తప్పించారని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం తుమ్మల స్వయంగా తనకు కాల్ చేసి బెదిరించారని వాపోయారు. సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు కుటుంబంతో తనకు 35 ఏండ్ల అనుబంధం ఉందని, అందువల్ల తాను ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌కు మద్దతు తెలిపానని స్పష్టం చేశారు. ఉద్యోగ విరమణకు మరో రెండు నెలల సమయం ఉండగానే ఉద్యోగానికి రాజీనామా చేసి పువ్వాడ అజయ్ గెలుపు కోసం పనిచేస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, వెంకటేశ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, బిక్కసాని దామోదర్‌రావు, బిచ్చాల తిరుమలరావు, తూములూరి ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, శివప్రసాద్, సుజాతరెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్

# మహారాష్ట్రలో అన్నిచోట్లా బీఆర్ఎస్ పోటీ

- 2 కోట్ల మంది క్రియాశీలక సభ్యులను చేర్పిస్తాం
- 17 వేల గ్రామాల్లో 9 విభాగాల్లో కమిటీల ఏర్పాటు
- బీఆర్ఎస్ కిసాన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్ కదం



హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): వచ్చే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని మొత్తం 288 సీట్లలో పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ మహారాష్ట్ర కిసాన్ సమితి అధ్యక్షుడు మాణిక్ కదం వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి, అధినేత కేసీఆర్ నేతృత్వంలో జరిగే సమావేశంలో చర్చించి పోటీ విషయమై ప్రకటిస్తారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్రలో చేపడుతున్న కార్యక్రమాల గురించి 'నమస్తే తెలంగాణ' ముంబై ప్రతినిధితో కదం ఫోన్‌లో మాట్లాడారు. దానికి గాను అన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను నియమించామని తెలిపారు. 20 లక్షల 85 వేల మంది పార్టీలో క్రియాశీల సభ్యులున్నారని తెలిపారు. రానున్న రెండు నెలల్లో రెండు కోట్ల మందిని క్రియాశీలక సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలోని 17 వేల గ్రామాల్లో పార్టీ పదాధికారులు, నాయకులు ఈ మేరకు కృషి చేస్తున్నారని వివరించారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ తరపున ఒక సమన్వయకర్తను నియమించామని, వారికి అన్నిరకాల శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఒక్కొక్కరికీ ఒక ట్యాబ్‌తోపాటు పార్టీ ప్రచార సామగ్రిని అందజేశామని చెప్పారు. పార్టీ విస్తరణ కోసం కొంకణ్, నాసిక్, ఔరంగాబాద్, నాగ్‌పూర్, పుణె, అమరావతి విభాగాల్లో ఆఫీస్ భవనాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హరిబావు రాథోడ్, ధర్మన్న సాదుల్, శంకరన్న ధోండ్గే, భానుదాస్ ముర్కుటే, చరణ్ వాగ్మారే, రఘునాథ్ దాదా, భగీరథ బాల్కే తదితర దిగ్గజ నేతలతోపాటు ముగ్గురు మాజీ ఎంపీలు, 15 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలో చేరడం పార్టీ బలోపేతానికి దోహదం పడిందని తెలిపారు. మహారాష్ట్రలో దళిత, ఓబీసీ, యువత, మహిళా తదితర విభాగాల్లో 9 కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఊరూరా గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ ప్రచార, ప్రసార బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. మహారాష్ట్ర ఇన్‌చార్జి కే వంశీధరరావు నేతృత్వంలో అన్ని పార్టీలకు ధీటుగా తమ పార్టీ కూడా పోటీలో నిలుస్తుందనడంలో సందేహంలేదని మాణిక్ కదం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధిస్తుందని మాణిక్ కదం ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలతో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

# ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయకుండా అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక తాము ఆ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేమని ప్రకటించింది. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంటూ.. పిటిషన్‌పై విచారణ ముగించింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూర్ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ విజయుడు ఆ పదవికి రాజీనామా చేయకుండానే అలంపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని, దానిని తిరస్కరించేలా రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఇదే స్థానం నుంచి పోటీ చేస్తున్న ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

# డీఎంఈ రెగ్యులర్ పోస్టు ఏర్పాటుపై నోటీసులు

హైదరాబాద్ నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు కావస్తున్నా రెగ్యులర్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పోస్టు ఏర్పాటు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో నాలుగు వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని బుధవారం ఆదేశించింది. డీఎంఈ పోస్టు నియామక వ్యవహారంపై వనపర్తి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఏ నరేంద్ర దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.


